నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 41




# మ్యాజిక్ రియలిజానికి ఆద్యుడు మన వ్యాసుడే!

**- మునిపల్లె రాజు**

తను పుట్టిన మట్టినీ, తన చుట్టూ మనుషుల్ని అమితంగా ప్రేమించిన వాడు. చిర సనాతనమూ, చిర నూతనము అయిన భారతీయ సంస్కృతిని నిత్యమూ ఆరాధించినవాడు. చిక్కని జాతీయతా భావజాలం నుండి అంతర్జాతీయ మానవతా దృక్పథాన్ని అవలోకించినవాడు. ప్రతి కథకూ ఒక తాత్వికాకృతిని కల్పించినవాడు. నిద్రారహితమైన మానవుడి అంతర్ జగత్తును గాఢమైన సానుభూతితో అపరిమితమైన మమతతో ఆవిష్కరించినవాడు. తన కథా సంపుటాల్ని ఒక చారిత్రిక చిత్రశాలగా రూపు దిద్దినవాడు. అయినా, ఈ లోకపు తాపత్రయాలకు దూరంగా నిల్చినవాడు మునిపల్లె రాజు. మ్యాజిక్ రియలిజమ్ మన వారసత్వమే అంటున్న కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మునిపల్లె రాజుగారితో ఇంటర్వ్యూ ఈవారం..

## అర్ధరూపాయి దొరకటం దుర్లభం

తెనాలి దగ్గర 'మునిపల్లె' మా స్వగ్రామం. నేను 16 మార్చి 1925న పుట్టాను. మునిపల్లె శారదాంబ, మునిపల్లె హనుమంతరావుగారు మా అమ్మానాన్నలు. మా నాన్న గారు బర్మాషెల్ (పెట్రోల్ అండ్ కిరోసిన్) కంపెనీ ఏజెంట్. దాంతోపాటు చిల్లర వ్యాపారాలు సైతం చేసేవాడు. అప్పుడు మేము ఆంధ్రాప్యారిస్‌గా పిలవబడే తెనాలిలో ఉండేవాళ్లం. 1930 దశకం మొదటి సంవత్సరాలలో సవర్ను బంగారం ధర పదమూడు రూపాయలు. బస్తా బర్మా బియ్యం ధర రెండున్నర రూపాయలు. నెల పొడు గునా సమృద్ధిగా సరిపోగల నెయ్యికి కేవలం రూపాయి వెచ్చిస్తే చాలు. పూటకూళ్ళింట్లో పావలాకు సుష్టయిన భోజనం. గోల్డెన్ కేఫ్‌లో రెండణాలకే నేతి పెసరట్టుకు తోడు ఉప్మా అరకప్పు చిక్కని కాఫీ. వడ్లమూడి నారింజ కాయలు అర్ధ రూపాయకే బుట్టనిండేవి. అయితే అది స్వర్ణశకం కాదు! ఆ అర్ధరూపాయి లభించటమే దుర్లభకార్యం. ప్రపంచ మంతా ఆర్థికమాంద్యం అలముకున్న రోజులవి. వ్యవ సాయ రంగంలో కాని, పారిశ్రామిక రంగంలోకాని ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ చేపట్టలేదు. అవి స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా నడుస్తున్న రోజులు. అంతకు ముందు జరిగిన ఉప్పుసత్యాగ్రహ మహోద్య మంలో మా పిన్ని జైలు శిక్ష అనుభవించి విడుదలైంది. ఆమె రెండు మూడు రాట్నాలు ఏర్పాటు చేసి మా అమ్మకు ఖద్దరు వడకటం నేర్పుతుండేది. పాత 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ వ్యాసాలు చదివి, ఇంటికొచ్చిన వారంద రికీ పిన్ని విశదీకరించి చెప్పేది. ఇవన్నీ నాకు గుర్తున్న బాల్యపు మొదటి జ్ఞాప కాలు.



శ్రీమతి సులోచనాదేవితో...

## ఈ మూడీ మనిషి కలం చేతపట్టాడా?

నాన్నగారి అతిగారాబం వల్లనో, అమ్మ కఠిన డిసిప్లిన్ కోడ్ వల్లనో నాకు సంప్రదాయ పాఠశాల విద్య అబ్బలేదు. ఉమ్మడి కుటుంబంలో నెలకొన్న సంస్కార వాతావరణం, సాంస్కృతిక రాజకీయ చర్చలు నాకు చాలా ఆసక్తిగా ఉండేవి. నాన్న బర్మాషెల్ ఏజెన్సీ పని నిమిత్తం మద్రాసు వెళ్లి వచ్చి చెప్పే కబుర్లు చాలా విలక్షణంగా ఉండేవి. అప్పుడే రెవెన్యూ డిప్యూటీ ఉద్యోగాన్ని వదు లుకుని వచ్చిన కక్కయ్య మునిపల్లె శేషగిరిరావు 'వితంతు శరణాలయం' కార్య దర్శిగాను, బ్రహ్మ సమాజ సంచాలకుడుగా ఉండేవారు. ఇంకో పినతండ్రి ముని పల్లె వెంకటప్పయ్యగారు తన సహోద్యోగి చలం గారింటికి వెళ్లినప్పుడల్లా నన్ను తోడు తీసుకుపోయేవారు. 'ఈయన మంచి కథలు రాస్తారు' అని మా కక్కయ్య అంటే, 'ఈ మూడీ మనిషి కలం చేత పట్టాడా' అనుకున్నాను. మా కజిన్ ముని పల్లె రామారావు 'లా' చదవడం కోసం కాశీ వెళ్లి అయిదేళ్లయినా తిరిగిరాలేదని, విప్లవకారుల్లో కలిసి కలకత్తాలో ఉంటున్నాడనే వార్తలు తెలిసాయి. ఎంతటి కల్లోల వాతావరణంలోనైనా ఇంటికి వచ్చే వారాల పిల్లలకు అమ్మ పంచి ఇచ్చే వాత్సల్యం మరువలేనిది. ఇవన్నీ భవిష్యత్తులో నా ఆలోచనా క్రమానికి దోహదం చేసి ఉంటాయని అనుకుంటున్నాను.



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంటూ...

## కథా స్వరూపం డ్రైవర్ రామలింగం గారి వద్ద నేర్చుకున్నా

లక్షిందేవమ్మగారని ఒకావిడ ఉండేవారు. ఆమె అప్పుడప్పుడు అమ్మకు వంటపనుల్లో, సంవత్సరమంతా నిలవచేసే పచ్చళ్ళ తయారీలో సాయపడటా నికి మా ఇంటికి వస్తుండేది. భావ వ్యక్తీకరణకు పలుకు ఎంత బలాన్నిస్తుందో ఆమెనుంచే నేర్చుకున్నాను. కథా స్వరూప మెళకువల్ని నేర్చుకుంది మాత్రం మా నాన్నగారి డ్రైవర్ రామలింగం గారి వద్దే! ఆయన నాన్నగారికి డ్రైవరూ, బాడీ గార్డు, గుమస్తా, మేస్త్రీ, బర్మాషెల్ ఏజెన్సీని నడిపిన వాడు అన్నీ ఆయనే! ఆయన నాకూ, అన్నయ్యకు తీరిక చేసుకుని కథలు వినిపించేవాడు. అతను కథ చెప్పే విధానం చాలా ఉత్సుకతగా ఉండేది.

## నాన్నగారు ఖిన్నులయ్యారు

ప్రతాపరుద్రీయం నాటకంలో యుగంధరుడి వేషం వేసినాయన మా ఫామిలీ డాక్టర్ గోవిందరాజు సుబ్బారావుగారేనని, చాకలి పేరిగాడి పాత్రధారి మా ఇంటి పొరుగు పెద్దిభొట్ల చలపతి గారేనని మా నాన్న ఒడిలో కూర్చుని వారి మాటల ద్వారా తెలుసుకున్నాను. స్థానం నరసింహారావుగారి 'రోషనారా' నాటకం తర్వాత మహమ్మదీయులెవరో గొడవ చేశారన్న వార్త తెలిసి హిందూ – ముస్లిం సమస్య ఎంతటి క్లిష్టమయిందో అర్థం చేసుకునే క్రమంలో నా మొదటి కథ రాశాను. అది 'చిత్రగుప్త'లో వచ్చింది. కథా ఇతివృత్తం రెండు మతాల సఖ్యత.

భగత్ సింగ్, రాజగురు, సుఖదేవుల్ని ఉరితీసిన వార్త తెలియగానే మా నాన్నగారు ఖిన్నులయ్యారు. మూడు రోజుల తర్వాత వచ్చిన ఆ ముగ్గురి ఫొటోకు నాన్నగారు పూలమాల వేసేవారు. దీనిని కథగా రాశాను. అయితే ఈ కథను చాలా పత్రికలు తిప్పి పంపాయి. చివరకు 'కృష్ణా పత్రిక' వారు మాత్రం ఈ కథను ముద్రించి, కాంప్లిమెంటరీ కాపీతో పాటు రూ.5 పారితోషికం కూడా పంపారు.

## విలువ కట్టలేని బహుమతి

నాన్నగారు కొద్ది నెలల్లో గతిస్తారనగా మాకిచ్చిన బహుమతి విలువకట్టలే నిది. తంగిరాల సోమయాజులుగారి పిల్లలు, మా బాల్యమిత్రులు వేణుతోనూ, వెంకుతోను నేనూ అన్నయ్య ప్రగల్భాలు పలకడం చూసి నాన్నగారు చలించిపో యారు. వెంటనే మమ్మల్ని అడయారు థియోసాఫికల్ సొసైటీ గ్రంథాలయ మంతా తిప్పి చూపి, వెయ్యి ఊడల మర్రి వృక్షం కింద ఒక అర్ధగంట కూచోబె ట్టారు. మళ్ళీ మాలో అహం తలెత్తకుండా ఆ విజ్ఞాన ఖనిజాన్నీ, ఆ విశాల వృక్ష దృశ్యాన్ని చూపిన నాన్నగారి సున్నిత విశిష్టత కూడా నా ముమ్ముందు రచనల కెంతో ఉపయోగపడింది.

## గట్టి పునాదులు పడిందక్కడే!

నాన్నగారి అపాత్ర దానాలు, ఆర్థికమాంద్యం కారణంగా మా వ్యాపార

సామ్రాజ్యం ఛిన్నాభిన్నమై పోయింది. అలాంటి పరిస్థితుల్లో నాన్నగారు స్వర్గస్తులయ్యారు. దాంతో మేము మా స్వగ్రామం 'మునిపల్లె'కు తిరుగు ప్రయాణమయ్యాం. సాహిత్యాభిరుచులకూ, రాజకీయ పరిజ్ఞానానికి గట్టి పునాదులు పడిందక్కడే! మునిపల్లె వివేక వర్ధనీ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు మాష్టారు జమ్ముల మడక రామ్మూర్తిగారు కవి పండితాభిమాని. జాషువా ఖండ కావ్యాల్ని ఆయన వినిపించేవారు. పక్కనే ఉన్న చిన్న పట్నం పొన్నూరులోని బ్రాహ్మణ వీధిలో డాక్టరు కుటుంబరావు గారింట్లో విశ్వనాథవారి కిన్నెరసాని పాటలు విన్నాను. నాకు మంచి నవలా సాహిత్యాన్ని పరిచయం చేసింది నా హైస్కూలు విద్యార్థి దశలో దామా సుబ్బారావూ, లోకనాథం మేస్టారు. లోకనాథంగారు డొస్టొవిస్కి నవల 'క్రైం అండ్ పనిష్మెంట్' మొదట చదివించారు. అర్థం తెలియని చోట విశదీకరించేవారు.

## నిబద్ధత లోపిస్తే రంగూన్ రౌడీకన్నా అధముడే!

నేను అనేక సినిమా సమీక్షలూ, విశ్లేషణాత్మక వ్యాసాలు రాశాను. దీనికి మా స్వగ్రామంలోని మునిపల్లె సుబ్బారావు కారణం. ఆయన సినిమా షూటింగుల్లో పాల్గొనేవాడు. కలకత్తా , కొల్హాపూర్‌ల నుంచి షూటింగులు ముగించుకుని విశ్రాంతి కోసం మా స్వగ్రామం వచ్చేవాడు. అతను నటుడికి నటన పట్ల ఎలాంటి అవగాహన ఉండాలో తరచూ చెప్పేవాడు. ఓసారి అతను 'కళాకారుడికి నిబద్ధత లోపిస్తే వాడు రంగూన్ రౌడీ కన్నా అధముడే' అన్నాడు. ఇది సాహిత్యకారుడికి కూడా వర్తిస్తుంది. ఆ నిర్వచనాన్ని నేనెప్పుడూ మరచిపోను.

## నక్సలిజం వస్తుందని ముందే చెప్పాను

ఆ నాటి రాజకీయ సాహిత్యం విరివిగా చదివిన ఫలితంగానే నక్సలిజం తలెత్తబోతున్నదని అయిదారేళ్ల ముందుగానే 'అరణ్యంలో మానవయంత్రం' కథలో చెప్పగలిగాననుకుంటాను. విశాలాంధ్ర అవతరించటం చారిత్రక అనివార్యం అని ఫజలాలీ కమిషన్‌కు ముందే 'వీరకుంకుమ' కథలో సూచించాను. కాని చైనావాడు మన దేశం మీద అత్యాచారం జరపడం తథ్యం అని 1950 దశకంలో నేను రాసిన కథను (రాతిబొమ్మా, మూగమనిషీ, చైనావాడు) ఆనాటి ప్రముఖ సాహిత్య పత్రిక వేయలేదు. ఆ కథకూడా పోయింది.

## లేకపోతే నేనూ రచయితనే అనుకోగలనా?

క్విట్ ఇండియా ఉద్యమంతో నా చదువాగిపోయింది. నేను మిలటరీలో చేరడంతో ప్రవాస జీవితం మొదలయింది. ఏ ప్రాంతంలో నివసించినా అక్కడి సామాన్య ప్రజల అవ్యాజ కరుణ మానవతా దృక్పథం నా కథల్లో ప్రతిఫలించేవి. లేకపోతే 'నేనూ రచయితనే' అనుకోగలనా? అందుకే – కడప జిల్లా లక్కిరెడ్డిపల్లెలో విషం గింజలు నూరుకొని తాగి ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు ఓబయ్యా, నేను ఒక రోజు నీళ్లు తోడి పోసినందుకు డబ్బు తీసుకోకుండా భోజనం పెట్టిన పూటకూళ్ళ తల్లి మండాది రంగమ్మ, గాలి వానలో నన్నూ తమ్ముణ్ణి రక్షించి, తర్వాత తన కొడుకును బయటకీడ్చిన మా పెత్తల్లి కాకుమాను ఎంకచ్చమ్మా, నీతి నిజాయితీలకి జీవితంలో ఎంత విలువ ఉన్నదో ఉగ్గుపాలనుండి నూరిపోసిన మా మాతృమూర్తి శారదాంబా, ఒక భూస్వామ్య అహంకార మంత్రి పుంగవుడి అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్న త్యాగనిరతుడు సత్తెనపల్లి కందిపట్ల సూర్యనారాయణ ... వీరంతా ఏదో రూపంలో నా కథల్లో నిలిచిపోయారు.

## మ్యాజిక్ రియలిజమ్ మొదట వ్యాసుడు రాశాడు


మానవుడి బాహ్య పరిస్థితులే కాకుండా అతడి అంతఃసీమలో జరిగే చర్యలకు నా రచనల్లో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాను. మనిషి అంతఃసీమలో ఎన్నో పురాతన భయాలు, కొత్త భయాలు దాగుంటాయి. బాహ్య స్థితితో పాటు వీటిని చిత్రించడమే మ్యాజిక్ రియలిజమ్. ఇటీవల యూరోపియన్, సౌత్ అమెరికా వాళ్లు ఈ ప్రక్రియలో ఎక్కువగా రాస్తున్నారు. చాలామంది మ్యాజిక్ రియలిజమ్ అనేది పాశ్చాత్యుల ప్రక్రియే అని నమ్ముతున్నారు. పరంపరగా వస్తున్న మన సాహిత్యాన్ని, సంస్కృతిని అర్థం చేసుకుంటే మ్యాజిక్ రియలిజమ్ కూడా అర్థమవుతుంది. దీనిని వ్యాసుడు చాలా ఏళ్ల క్రితమే రాశాడు. ఈ ప్రక్రియ మనదే!

## భారతీయులది విశాల హృదయం

బాబిలోనియన్, ఈజిప్షియన్, గ్రీకుతో పాటు అనేక నాగరికతలు నాశనం అయినా భారతదేశంలో ఇంకా బలం కావడానికి కారణం ఏమిటో తెలుసా? ఇక్కడ దయా, దాక్షిణ్యం, కరుణ, సహనం అనేవి మనవాళ్ల లక్షణాలు. వీటితో పాటు విదేశాలనుంచి వచ్చిన అన్ని మంచి ఆచారాలను మనం కలుపుకుంటున్నాం. భారతీయులది విశాల హృదయ సంప్రదాయం. దీనిమీద ప్రతి నిముషం దారుణంగా దాడులు జరుగుతున్నా ఇది నిలబడుతూనే ఉన్నది.

## పాత సాహిత్యం చెత్త అంటే కుదరదు

అధ్యయనం బాగా ఉంటే వ్యక్తీకరణా బాగుంటుంది. అభివ్యక్తికి పునాది అధ్యయనం. ఇప్పటితరం రచయితల్లో అది కొరవడింది. పాత సాహిత్యం అంతా చెత్త అంటే కుదరదు. మనం గొప్ప కవులుగా చెప్పున్న శ్రీశ్రీ, తిలక్, దాశరథి, గుంటూరు శేషేంద్రశర్మ కూడా ప్రాచీన సాహిత్యాన్ని బాగా చదువుకున్నవారే! పాత సాహిత్యంపైన ఎంత ఎక్కువ అథారిటీ ఉంటే కొత్త సాహిత్యాన్ని అంత బాగా రాయగలరు. ప్రాచీన సాహిత్యాన్ని విసర్జించాలి అనడం వలన మనం చాలా నష్టపోతాం. నా ఇప్పటి ఈ జ్ఞానం పురాతన సాహిత్యం చదవడం వలన లభించిందే! పద్యం, నవల, నాటకం అన్నీ మన సంస్కృతిలో భాగాలే!



పతంజలి, పురాణం సుబ్రహ్మణ్యశర్మలతో...

## ఏ ప్రాంతమయినా సామాన్యుడి పరిస్థితిలో మార్పులేదు

మిలటరీ ఇంజనీర్ సర్వీసులో 39 ఏళ్లు పని చేసిన నేను చాలాకాలం తెలుగు మాట, తెలుగు సాహిత్యం వినబడని కనబడని ప్రాంతాల్లో ఉండాల్సి వచ్చింది. సెకండ్ వరల్డ్ వార్ చూశాను. దారిద్ర్యం చూశాను. సౌభాగ్యం చూశాను. చాలా విషాదాలు చూశాను. విషాదం నుంచే మంచి సాహిత్యం పుడుతుంది. దేశంలో ఏ ప్రాంతంలో అయినా సామాన్యుడి పరిస్థితిలో మాత్రం మార్పులేదు. మిలటరీలో దేశం నలుమూలలనుంచి వచ్చిన జవాన్లు ఉండేవారు. అన్ని రకాల సాంస్కృతిక నేపథ్యాలనుంచి వచ్చినా కూడా ఆర్మీలో భారతీయ సంస్కృతి ఒక్కటే అని నిరూపించాం. ఇప్పటికీ ఆర్మీలో అదే గొప్పతనం.

## సమ్యక్ దృష్టి ఏర్పడింది

మా బంధువుల పిల్ల సులోచనాదేవితో 1950లో నాకు పెళ్లయింది. మాకు ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. అందరూ స్థిరపడ్డారు. నాకు 85 ఏళ్ల వయసొచ్చింది. రెండు ప్రపంచ యుద్ధాలను చూడటం, దేశమంతా తిరగడం, అనేకమందిని కలవడం, అనేక రకాల సంస్కృతులను చూడ్డంతో సమ్యక్ దృష్టి ఏర్పడింది. భౌతికమైన వాటిపై ఇష్టాయిష్టాలు లేవు.

– సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన నా కథ

# సవతి తమ్ముడు

- మునిపల్లె రాజు

**ఆర్టిలరీ రెజిమెంట్-అంటే-ఫిరంగి దళం. ఆఫీసర్ల మెస్ ఎప్పుడూ కళకళలాడు తుండటం రోజూ తిలకించే వాళ్ళకే అనుభవంలోకి వచ్చే విషయం. పెద్ద ఆవరణ. ముందుభాగంలో ముచ్చట కొలిపే పచ్చటి లాన్. అంతకుమించి బ్రిటిషుకాలం నాటి పెద్దపెద్ద వృక్షాలు. భవనం గూడా కలోనియల్ తరగతిదే అని విశాలమైన వరండాలు, రాబర్ట్ క్లైవ్ కాలం నాటి మూడడుగుల వ్యాసం గల కోటలు కట్టిన సున్నపు స్తంభాలు - చూచే వాళ్ళకు ఇట్టే అర్థమై పోతుంది. చెట్లవెనక టెన్నిస్‌కోర్టులో కెప్టెన్ తివారీ (టిక్స్) నారాయణన్ (నిక్స్) సింగిల్స్‌లో ఉన్నారు. వరం డాలో కారమ్స్ ముందు కూచున్న - రస్తోగి (రాట్స్) పూరి (పికిల్స్) మధ్య మధ్య హుషారుగా కేకలేస్తూ తమ ఆటకన్నా వాళ్ళ ఆటనే తిలకిస్తున్నట్టున్నారు. దాదాపు అందరికీ ఏదో ఒక ముద్దు పేరు. యాభై వయసులో పడ్డ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్‌జగన్నాథ్ గూడా - ఈ కుర్రకారుకు జిమ్మీ. అయితే ఆయన ముందు అనరు.**

మేజర్ మూర్తి రెజిమెంట్ ఆటస్థలాల నుంచి అప్పుడే తెల్లషార్టు. షర్టు మీది మట్టి మరకలతో వచ్చాడు. జవాన్ల గేమ్సులో చాలా ఆసక్తిచూపు తాడు. ఆ సాయంత్రం వాలీబాల్, ఫుట్‌బాల్ ఆటగాళ్ళ సెలెక్షన్లు జరిగాయి. చాలా సీనియర్ అయిన మేజర్ మూర్తికి ఇటువంటి బాధ్యతలు అదనంగా పడుతుంటాయ్. స్వతహాగా మంచి ఆటగాడు.

ఆ నెలకు మెస్ సెక్రటరీ కావటం వల్ల గబగబా హెడ్ కుక్‌కు, మసాల్జీకీ, బేరర్లకూ, బాయిస్‌కూ 'మెనూ' గురించి కొద్ది చర్చ తర్వాత ఆజ్ఞలు జారీ చేశాడు. అదిగాక ఆ రాత్రి మెస్ డిన్నర్ నైట్. రెజిమెంటల్ ఆఫీసర్లు కుటుం బాలతో సహా వస్తారు. సైనికాచారం ప్రకారం - పెళ్ళి అయి కుటుంబాలతో క్వార్టర్సులో ఉంటున్న ఆఫీసర్లు కూడా మెస్‌లో సభ్యులే. డిన్నర్ తర్వాత ఫిలిం షో ఉంది. కమాండింగ్ ఆఫీసర్ పెద్ద కూతురు లీలా జగన్నాథ్ సెలెక్ట్ చేసిన అర్థం పర్థం లేని వ్యాపార సినిమాలంటే అందరికీ మంటే. ఈ మాటు కెప్టెన్ దేవ్‌గుణ్ సబ్ టైటిల్స్ ఉన్న ఒక రష్యన్ పిక్చరు పేరుచెప్పి మొత్తం మీద దాన్ని రప్పించాడు. ఆర్ట్ ఫిలిమ్స్ అంటే తనకూ ఇష్టమే. నిజానికి రెజి మెంటల్ ఫిలిమ్ క్లబ్బుకు, మెస్ లైబ్రరీకి తనే సెక్రటరీ అయినా, దేవ్‌గుణ్ అభిరుచులు చాలా ఉదాత్తమైనవని అనుకొంటూ ఉంటాడు. అటువంటి మూర్తికి మాత్రం ముద్దుపేర్లుండవా? పూర్తి పేరు దక్షిణామూర్తి కావటం వల్ల ''డెక్కన్స్'' లైబ్రరీ పుస్తకాల పురుగుగా 'బుక్ వర్మ్'.

రష్యన్ చిత్రం చాలా అద్భుతంగా వుంది. మొత్తం వంద నిమిషాలే. వేరా పనోవా కథ- ''సిస్టర్స్''. కథ, నటన, ఛాయాగ్రహణం అద్వితీయం అన్నారందరూ. కల్నల్ తన భుజం తడితే, తను దేవ్‌గుణ్‌ను సెభాసన్నాడు. ఎందుకో మూర్తి ఆలోచనా నిమగ్నుడైనాడు. ఎందుకో ఏమిటి? అది తన జీవితంలో కొన్నిఘట్టాలను చిత్రించినట్లుంది. కాకపోతే అందులో 'గాల్యా' అనే యువతిది ప్రధాన పాత్ర. గాల్యా బదులు మూర్తి అనే యువకుడైతే జీవితం అంతా ఒకటే.

గాల్యా సుకుమారమైన బాల. తల్లి మరణంతో జీవితంలో విషాదఛా యలు. తండ్రి గొప్ప భావుకుడు. తననెంతో గారాబం చేసేవాడు. కూతురు సంరక్షణకు ఆడదిక్కు కావాలని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అదే అతను చేసిన తప్పు.

ఆ సవతి తల్లి లావుగా చామనచాయతో ఉండేది. సోమరిపోతు, ఇంట్లో అడుగు పెట్టటమే తరువాయి, తనకు అన్నిపనులూ పురమాయించేది. మామూలు పనులు గాదు. మొరటుపనులు తన వయసుకు మించినవి. ఇల్లంతా చిందరవందర. తను శుభ్రంగా ఉండదు. ఇతరులను ఉండని వ్వదు. మొదట్లో తండ్రి మందలించటానికి పూనుకొన్నాడు. తర్వాత వర సగా పిల్లల్ని కనటం ప్రారంభించింది. తండ్రి మారిపోయాడు. తనను తిట్టినా, కొట్టినా ఉదాసీనంగా ఉండిపోయే వాడు.

గాల్యాకు స్కూల్లో మంచి మార్కులొచ్చేవి. స్టేజిమీద నాటకాల్లో పాత్రలు ధరించేది. తన టీచర్ ఎలిజవెత్ ఆండ్రే యెవనా ప్రోత్సాహం ఎంతో ఉండేది. స్కూలు లైబ్రేరియన్‌కూ తనంటే ప్రాణమే. ఎన్ని అడ్డంకులె దురైనా హైస్కూలు చదువు పూర్తిచేసింది. సవతి తల్లికి తనిక చదవటం ఇష్టం లేదు. తండ్రికి మాత్రం రహస్యంగా ఇష్టమే. ఈ మురికికూపం నుంచి బయట పడాలి. టీచర్ ప్రోత్సాహంతో సియొరోఫోల్ పట్నం వద్ద చిన్న గ్రామం నుంచి మాస్కోలో థియేటర్ స్కూలుకు బయలుదేరుతుంది. అయితే ఒక్కటే విచారం. సవతి చెల్లెలు తనలాగా అందమైనది. శ్రద్ధ గలది. ఇక్కడి పెంపకంతో తన సవతి తల్లి మొరటు బుద్ధులన్నీ అబ్బుతాయనే దిగులూ, విచారం. అయినా ఈ పీడకలకు దూరం కావాలి.

మాస్కోలో గాల్యా సహజ ప్రజ్ఞ, ఉపజ్ఞ, నటనా కౌశలం మంచులో పుష్పంలా విచ్చుకొన్నాయి.

అయినా గుండెలో ఏదో చిన్నముల్లు గుచ్చుకొన్నట్లు వేదన. తండ్రి తాగుడుకు బానిస కావటం తను చూసింది. అప్పుడప్పుడు సవతి తల్లి గూడా అతనితో కూర్చునేది. ఇక తన సహోదరి కాకపోయినా సవతి చెల్లి అయినా ఆ పిల్ల భవిష్యత్తేమిటి? అనేదే ఆ ముల్లు.

గాల్యా ఉత్తమ పాత్రలు ధరించింది. పెద్దజీతం అందుకొంటున్నది. ఒకటి రెండు సినిమాల్లో గూడా నటించింది. స్టేజినుంచి వెండి తెరకు వలస పోవాలని తనకు లేదుగాని తప్పనిసరి అయింది. స్టేజి ఉత్సవాలకు, విదేశాలకు వెళ్ళి కొన్ని నెలల తర్వాత తిరిగి వచ్చింది. వచ్చిన రోజునే మూడు నెలల క్రిందటి చెల్లెలు జాబు చూచింది. ''తండ్రికి లివర్‌లో అల్సర్. అశ్రద్ధ చేశాడు. చివరకు ఆపరేషన్. టేబిల్ మీదే చనిపోయాడు. తనను చూడాలని తహతహ పడ్డాడు''.

ఆ మురికికూపం, ఎర్రటి కళ్ళతో శాండోలాగా తన సవతి తల్లి. తనను రక్షించ లేని తండ్రి మరణం. పీడకల తిరిగి దర్శనం, ఎట్లయితేనేం. తండ్రి సంవత్సరీకానికి స్వగ్రామానికి విమానంలో బయలుదేరింది. చెల్లెళ్ళకూ, సవతి తల్లికీ చిన్నచిన్న బహుమతులు. రిటైరయిన టీచరుకూ, లైబ్రేరియనుకూ, గ్రంథాలయంలో పుస్తకాలకు అడ్డు చెప్పకుండా తన చెల్లికి ఇవ్వమని లైబ్రేరియన్‌తో అప్పటి తన చివరి సంభాషణ. ఆ పిల్ల చదువుతున్నదో లేదో, ఈ పదేళ్ళూ. అయినా తన అవమాన పరంపరల బ్రతుకుతో, ఈ విషయాలు పట్టించుకోదగినవిగా అనిపించక మెదడు పొరలోకి నెట్టేసింది.


గాల్యా తండ్రి సమాధికి మోకరిల్లింది. తన పాత టీచర్ను దర్శించింది. లైబ్రేరియనయితే లేదు. సవతి తల్లిలో మార్పేమీలేదు. తనకన్నా తన బహుమతులంటేనే ప్రేమ చూపింది. ఆ రాత్రి చెల్లెలు తన మంచం మీదనే పడుకొన్నది. తెల్లవారుజాముదాకా ఎడతెగని మాటలు. తండ్రి చివరి రోజులు, స్కూలు, ఇంట్లో పరిస్థితులు, పర్యాటకులు వచ్చినప్పుడు ఇల్లద్దెకిచ్చి తామంతా సావడిలో కాపురం, చెల్లెలి భవిష్య ఆలోచనలు. గాల్యాకు చెల్లెలి మాటలతో – పాత ద్వేషమంతా చెదిరిపోయింది. బీటలు వారి ఇప్పటికే మొరటు తేలుతున్న చెల్లెల్ని. ఈ నరకంలో ఇంకా ఉంచితే, జరగనున్నది ఊహించింది. తనతో మాస్కోకు పయనం కట్టించాలి. అక్కడే చదివి సారస్వతంలో పెద్ద డిగ్రీ తీసుకొని, లెక్చరర్ కావాలి. సాహిత్యమంటే చెవికోసుకొనే చెల్లికి అన్యాయం జరగకూడదు. అనీ నిశ్చయించుకొంటుంది.

'సినిమా అయిపోయింది గాని తన జీవితం ప్రారంభమైంది' అనుకొంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు మేజర్ మూర్తి. నిద్ర పట్టలేదు. మెస్కు అనుబంధించి ఉన్న అయిదారు గదుల్లోనూ, తనతోటి ఆఫీసర్లు గాఢ నిద్రలో ఉన్నారు. నిశ్శబ్దం గూడా తనను నిద్రపోనీయదు.

***

రెజిమెంట్‌లో ముద్దుపేర్లకు తోడు మేజర్ మూర్తికి మిలిటరీ హాస్పిటల్‌లో ఇంకో నిక్ నేమ్ ఉంది. స్పెషలిస్టు కల్నల్ కళ్యాణరామన్, ఆఫీసర్ కమాండింగ్ బ్రిగేడియర్ ధావన్





# సీత రాముడిని 'నీవు స్త్రీవి' అనటం ధర్మమా?

**1. కాట్రగడ్డ వెంకట్రావు, పామర్రు**

**ప్ర : బ్రాహ్మీ ముహూర్తం అంటే ఏమిటి?**

స : బ్రహ్మ అనగా వేదము. వేదము విధించిన సంధ్యావందనాది కర్మలను ఆరంభించు కాలమును తెలుపునది బ్రాహ్మీ ముహూర్తము. సూర్యోదయ మునకు 7 1/2 ఘడియలు అనగా మూడు గంటల ముందునుండి సూర్యోదయము వరకున్న కాలమును బ్రాహ్మీ ముహూర్తమందురు.

**2. ఆముదాల రాజ్యలక్ష్మి, నిడదవోలు**

**ప్ర : భర్త మరణించిన స్త్రీ మాంగల్య చిహ్న లను తీసెయ్యాలని వేదాలు నిర్దేశించాయా?**

స : భర్త ఉండుట మాంగల్యమని మీరే

# సందేహాలు - సమాధానాలు



**నిర్వహణ : కందాడై రామానుజాచార్యులు**

అంటున్నారు. భర్త మరణించినపుడు మాంగల్యం మరణించినట్లే కదా. మరణించిన తరువాత జీవలక్షణాలుంటాయా?

**3. రమణమ్మ, విజయవాడ**

**ప్ర : దేవునికి కొబ్బరికాయ సమర్పించు టలో విశేషమేమిటి.**

స : కొబ్బరికాయ మన శరీరం. అందులోని నీరు మన మనసు. దాని పీచు (నార) మన కర్మలు. ఈ మూటిని భగవంతునికి అర్పించటం కొబ్బరికాయ నివేదన.

**4. వెంకటరెడ్డి, కడప**

**ప్ర : సీత, రాముని 'స్త్రియం పురుష విగ్ర హం'(అనగా నీవు మగవాని ఆకారంలో ఉన్న స్త్రీవి) అనుట ధర్మమా?**

స : అలా అనకుంటే రాముడు సీతను అడవికి తీసుకుని పోడు. సీత అడవికి పోకుంటే రావణా సురుడు చావడు. రావణ వధ జరుగకుంటే మన మందరం బాగుంటామా? బిడ్డల బాగుకోసము తల్లులు భర్తను అధిక్షేపించటం సహజమే!

**5. నాగరాణి, చీరాల**

**ప్ర : పూజ ఎందుకు చేయాలి?**

స : ఇలా అడిగే నోరు ఇచ్చినది దేవుడే కదా. ఇవన్నీ ఇచ్చినందుకు పూజ అనేది కృతజ్ఞతను ప్రకటించుటే!

**6. పుష్ప, హైదరాబాద్**

**ప్ర : పూర్ణాహుతులు అంటే ఏమిటి? పూర్ణా హుతులకు వాడే ద్రవ్యాలు ఏవి? వాటి విశిష్టత ఏమిటి?**

స : యజ్ఞము హోమము ప్రక్రియ సంపూర్ణ మైనపుడు చేయు ఆహుతిని పూర్ణాహుతి అంటారు. దేవతలందరికి చేరవలసిన దానిని చక్కగా అగ్ని చేర్పించినందుకు, యజ్ఞమును పూర్తి చేసినందుకు శ్రీ మహావిష్ణువుకు అర్పించు ఆహుతియే పూర్ణాహుతులు. ఇక పూర్ణాహుతి ద్రవ్యాలు వాటి విశిష్టత ఆ యా యాజ్ఞిక గ్రంథా లతో, పురోహితులతో తెలుసుకోవచ్చును.

మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి

**సందేహాలు-సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033**

అతన్ని 'బబుల్స్' అని పిలుస్తుంటారు. కల్యాణరామన్‌తో తమిళంలోనూ, ధావన్‌తో డోగ్రీ భాషలోనూ జోకులు వేయగల తన బహు భాషా జ్ఞానానికి అనుకొనేవాడు. నిజానికి తనకు హిందీలో అన్ని ప్రాంతీయ నుడికారాలూ తెలుసు. ఖడిబోలీ, మాగధీ, మైథిలీ, రాజస్థానీ, పహాడీ, మిలిటరీ డాక్టర్లు అందుకోసం కాదు, ఆ టైటిల్ ఇచ్చింది. తన కుడికణత మీద రెండు. ఒక మిల్లీమీటరు లోతు గాయాల మచ్చలుండేవి. ఇప్పుడయితే అవి గ్రాఫింగ్ కింద మాయమైనాయిగాని, తన సర్వీసెస్ సెలెక్షన్ బోర్డు పరీక్షలో నెగ్గి మెడి కల్ బోర్డు ముందు అలహాబాద్‌లో పదేళ్ళక్రితం నిలబడినప్పుడు పెద్ద సమ స్యనే తెచ్చి పెట్టాయి. ఆ దెబ్బల ప్రభావం మెదడు మీద గూడా ఉండవచ్చని బోర్డులో ఒక స్పెషలిస్టు మళ్ళీ డీటెయిల్డ్ టెస్టులకు పంపించాడు. తనకు శరీరమంతా చెమటలు పోసినై. తన భవిష్యత్తు ఇక చీకటే అనుకొన్న ఆ క్షణాలు.

చివరికవి ఆటల్లో చిన్ననాటి స్వల్పగాయాల కింద తేల్చేశారు గాని వాస్తవాని కవి తన సవతి తల్లి వంట చేస్తూ, చేతిలో ఉన్న పాత్రలు దింపే పట్కారును తన మీద బలంగా విసిరినప్పటివి. రక్తం కారింది తెలుసు. మూర్ఛపోయింది తనకు తెలుసునా? తెలీదు. అయిదేళ్ళ సవతి తమ్ముడు ఆ రక్తం చూసి చేసిన ఆర్తనాదం - 'నాన్నా అన్నయ్య చచ్చిపోయాడు' - తనకు తెలివి తెప్పించిన నాదం. ఆర్తి! అదీ తన జీవితం. తన బాల్యం కౌమారం, ఆర్తి, ప్రార్థన; అందుకే శబ్దం తనను మేల్కొలుపుతుంది. నిశ్శబ్దం నిద్రపోనీయదు. చిన్న అలలలాంటి ఆ మచ్చల జంట బుడగలు! బబుల్స్!

జీవించటానికి యుద్ధం చేయాల్సిందేనని భయపడవద్దని నేర్పిన బబుల్స్ తను కుంగిపోయి నప్పుడు; ఏకాంతంలో కుమిలిపోయినప్పుడు, తను ఖండ ఖండాలుగా విడిపోతున్నాననిపించిన ప్పుడు, భయపడినప్పుడు, రాబోయే జీవనగతిని ఆలోచించినప్పుడు - జుట్టులో వేళ్ళుపోనిచ్చి ఆ గాయాల్ని తడుముకొంటే ఎంతో శక్తినీ, జ్ఞానాన్నీ పొందేవాడు. జ్ఞాపకాలు వెనక్కి తరిమినప్పుడల్లా జుట్టులోకి వేళ్ళు పోనిచ్చుకొంటాడు. తను రెండవ డిఫెన్స్ కోర్స్ పూర్తి చేసిందాకా ఆ అలవాటు ఉండేది. మధ్యలో ఎప్పుడు తప్పిపోయిందో, మళ్ళీ ఈ రాత్రి హఠాత్తుగా వచ్చింది. ఒక ఆర్త నాదం గూడా - ఒక పసివాడి గొంతు - "నాన్నా అన్నయ్య చచ్చిపోయాడు!" తెల్లవారుజామున తిరిగి అకాలంగా మెలకువ.

రేపు ఫోను చేసి మిలిటరీ ఆస్పత్రికి వెళితే మంచిదేమో. ఆ నాన్న చని పోయినప్పుడు తనకు తెలియదు. ఆ ఆర్తనాదం బాలుడి సంగతీ తెలి యదు. తెలిసిందీ, చేతనలో ఉన్నదీ సవతి తల్లి పెంపకం. పద్మాసనంలో కూచొని యోగం చేస్తున్న అమ్మరూపం పొగవెనక వస్తువు. పద్మాసనంలోనే అమ్మ అంతిమశ్వాస విడవటం గూడా లీలగా గుర్తు. ఒకసారి తను కోర్సులో ఉన్నప్పుడు ఆర్మీ సైకియాట్రిస్టును సంప్రదించాడు. అమ్మ మరణం గురించి తన చిన్ననాటి అనుభూతుల్లోంచి తొంగి చూసిన రూపాన్ని గురించి. "నువ్వు పెళ్ళి చేసుకో. నీ భార్యలో తల్లి మళ్ళీ కనబడుతుంది" అని సలహా యిచ్చాడు. తను చేసుకోబోవటం లేదు.

ఎవర్ని చేసుకోవాలి? లీలా జగన్నాథ్‌నా - తనంటే ఎంతోమోజు కనబ రుస్తుంది. కల్యాణరామన్ చిన్న సోదరినా? తనకు 'శిలప్పాదికారం' తమిళ కావ్యం మీద లెక్చరిస్తుంది. ఆల్మోరా వద్ద తనుచూసిన పహాడి కన్య మేజర్ నౌతియాల్ మరదల్నా?

సినిమాలో గాల్యా తను. ఆమెకు ఎలిజవిటా ఆంద్రెయేవనా ఉంది. దీపం చూపేందుకు, తనదీపం జోషీమట్‌లో. హిమాలయాల్లో నారాయణ్

దత్తు జోషీ. బదరీనాథ్ యాత్రా మార్గంలో మూడు యుగాల పాపపుణ్యాలను వీక్షిస్తున్న త్రియుగ నారాయణుడి మందిరం ముందు కన్పించి, చలికి తన శాలువా కప్పిన గురువు. పితృసమానుడు. ఆయనా లేడిప్పుడు! అసలు తను హిమాలయాలెందుకు వెళ్ళినట్టు? చేతి సంచిలో తన మెట్రిక్యులేషన్ పుస్తకం. నిక్కరు, పైన తువాలు, చెప్పులు లేని కాళ్ళు, రిషికేశ్‌లో కట్టిచ్చిన మఠం చపాతీలు. గుండెలో కొండంత బలం. యుద్ధంలో పలాయనం చేసిన పిరికి వాళ్ళున్నారు. ప్రేమతో పలాయనం చేసిన వాళ్ళూ ఉండవచ్చు. ఈ దురంత, నిశిత స్మృతుల నుంచి పారిపోగల శక్తి ఎవరికీ ఉండదేమో. లైబ్రరీలో స్విచ్ వేసి పుస్తకం తెచ్చుకొన్నాడు.

సైనిక సర్వీసులో అందరికీ సాంవత్సరిక సెలవులుంటాయి. జవాను గాని ఆఫీసరు గాని, రెండు నెలల దాకా, స్వగృహానికీ, స్వంత గ్రామానికీ ఫ్రీ వారంటూ, ఆఫీసర్లకు రెండేళ్ళకొకసారి స్వగ్రామానికైతే ఫ్రీ వారంటు, ఇంకో సంవత్సరం కన్సెషనల్ వారంటు, సెలవులు గడపడానికి ఆ సంవత్సరం. స్వగృహానికి వెళ్ళక్కర్లేదు. ఏ ప్రదేశానికైనా వెళ్ళొచ్చు. ఎల్.టీ.సీ అంటే లీవ్ ట్రావెల్ కన్సెషన్.

మేజర్ మూర్తి ఎప్పుడూ ఇరవై రోజులకు మించిన సెలవు తీసుకొన్న రివాజు లేదు. డ్యూటీ. డ్యూటీ. డ్యూటీ. తనకు ఇల్లేది? స్వగ్రామం ఏది? లైబ్రరీలో పుస్తకాలన్నీ తన మిత్రులు, ఆప్తులు! పరీక్షలకు చదివే ఏ ఆఫీసరయినా, సందేహాలతో తనను సమీపించినప్పుడు, అలెగ్జాండర్ ది గ్రేట్ యుద్ధం నుంచి మొన్న మొన్నటి బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం వరకూ అనర్గళంగా అన్ని విన్యాసాల్ని గురించీ, యుద్ధతంత్రాల గురించి ఉపన్యసించగలడు.

లంగ్డా తైమూర్, బాబర్, చెంగిజ్‌ఖాన్, నెపోలియన్, వెలింగ్‌టన్, రోమెల్ ఐసెన్ హూవర్, ఝుకోవ్, కోర్నిలోఫ్, మన ఫీల్డ్‌మార్షల్ మానిక్‌షా వరకూ, నెపోలియన్, మార్షల్ మురాట్, జీన్‌బాప్టిస్ట్ – ఫిరంగి దళ విన్యాసాల్లో నిపుణులు. వీళ్ళందర్నీ తలదన్నిన వాడు రష్యన్ మార్షల్ ఝుకోవ్, బెర్లిన్ మీద ఎర్ర పతాకం ఎగరేసిన వాడు. వీళ్ళను గురించి తను ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నప్పుడు ఇచ్చిన క్లాసులు – కొన్ని టేప్ చేయటం విశేషం కాదు. ఇస్రాయేల్ చిన్నదేశం అయినా సైన్యమూ, ధైర్యాన్నీ ఆయుధ తంత్రంతో రంగరించి పోసి, గెలిచి, ఓడిన అన్నియుద్ధాల గురించి అతను చెప్పుకోదగ్గ స్పెషలిస్ట్.

***

అమ్మ చనిపోయిన ఆరునెలలకే నాన్నకు కొత్త పెళ్ళి చేశారు. ఎవరో గాదు. తన మేనమామే. అతని అంతర్యం తెలియదు. నాన్న చీట్లపేకలో కరిగిస్తున్న ఆస్తిని రక్షించుకోగలదనా! తన పాలనకా? అప్పటికే తను హైస్కూలు అంచుల మీద ఉన్నాడు. పిన్ని–తన సవతి తల్లి – పెళ్ళి నాటికే ముప్ఫై ఏళ్ళ పడుచు. బహుశా రిక్తమైన తన యౌవనపు ముద్దుముచ్చట్లు తిరిగి రాలేనివని తెలిసిన ప్రౌఢ కాబోలు. తన బదుకులో ఈ బాలుడే నిప్పులు పోశాడనుకొన్నదేమో! తను సవతి బిడ్డేగాదు, జన్మశత్రువై పోయాడు. కొత్తల్లో మానేసిన చీట్లపేక అలవాటు నాన్నకు నిద్రనిచ్చే పలాయన మంత్రం.

కొన్నాళ్ళు ఆమె తిట్లను వినిపించుకొనే వాడు కాదు తను. రోజుకు పది సార్లు కాఫీ తాగేది. కుంపటి మీద, సన్నని నిప్పుసెగ మీద డీకాషన్ తయారుగా ఉండేది. కాఫీ పొడరుకు ఎక్కువ ఖర్చో చీట్లపేక ఓటముల్లో ఎక్కువ నష్టమో – నాన్నకే తెలియాలి. భయంతో తనతో మాట్లాడటం తగ్గించివేశాడు. పిన్ని ముందుంటే తన వంక కూడా కన్నెత్తి చూసేవాడు గాదు.

కష్టం మీద ఆ మరు సంవత్సరమే కవల పిల్లల్ని కన్నది. ఇద్దరూ పోయారు. ''ఈ ముదనష్టపు వెధవే అంతకూ కారణం''.

గిన్నెలు తోమించింది. కళ్ళాపి చల్లించింది. ఎందుకూ తను చింతించలేదు. క్రాపు చేయించుకోటానికి డబ్బులడిగినందుకు దెబ్బలు. ఆ మరు సంవత్సరమే ఇంకో కాన్పు. తనకప్పుడు డబల్ ప్రమోషన్ వచ్చి హైస్కూల్లో చేరాడు. ఒక్కటే నిక్కరు. చంకలకింద చిరిగిన చొక్కా ఎండలో కుక్కి మంచంలో పడుకొని లెక్కలన్నీ క్లాసులోవి, జ్ఞాపకం చేసుకొంటూంటే, వెంటనే పలకలేదని చీపురుతో సన్మానం. తనకెప్పుడూ తలంటలేదు. పండగలకు తమ్ముడితోపాటు కొత్త గుడ్డలు తనకుండవు. ''దరిద్రపు వెధవా, శనీ చరుడా!''

అట్లా జీవిత యుద్ధానికి పిన్ని తనను తయారుచేసింది. అప్పుడైతే తనే శత్రువుతోనూ పోరాడుతున్నట్లనిపించేది గాదు. తనతోనే తన పోరాటం. లెక్కలతో, బ్రతుకుతో. ప్రతిరోజూ ప్రతి క్షణమూ, నిజంగా తను సైన్యంలో చేరి శత్రువుతో చావు బతుకుల యుద్ధం చేస్తానని అనుకొన్నాడా? కాని ఎప్పటికైనా గెలుపు తనదేనన్న ఉద్వేగ భరితమైన తలపులు. కణత నుండి రక్తం కారిన క్షణాల్లో, తమ్ముడి ఆర్తనాదం విన్న తర్వాత ఆ నమ్మకం – పనలు పనలుగా పేనుకోటం. తను ఓడిపోడు. ఎన్నటికీ.

స్నేహితుల ప్రోద్బలంతో, గాయం నయంకాగానే మేనమామ ఇంటికి పయనం. పుస్తకాలే తన తోడు. ఆయన ముభావంగా ఊరుకొన్నా భార్య మూతి ముడిచింది ఆ సంవత్సరం. అంత టెన్షన్‌లోనూ లెక్కల్లో ఫస్ట్ మార్క్, మొదటిరాంక్, ఫిరంగిదళం అధికారులకు లెక్కల్లో బాగా ప్రవేశం ఉండాలి. ఫిరంగిని నిలబెట్టే స్థలం. ఉజ్జాయింపుగా నాశనం చేయవలసిన శత్రుస్థలం, వీస్తున్న గాలివేగం, దిశ, గుండు నేరుగాపోదు. చిన్న ఆర్క్ కొడుతుంది. అన్నిటికీ లెక్కలు. జీవితంలో ప్రతి మలుపులోనూ లెక్కలు అవసరం కాబోలు.

## భారతీయుని ఆత్మ



*ఒక లోతయిన మానవీయ దృక్పథాన్ని అందంగా చెప్పిన కథ ఇది. ఇందులో భారతదేశం యొక్క సంస్కృతి ఉంది. భారతీయుని ఆత్మా, భారత సైన్యం యొక్క అగ్రగామి ధోరణి అన్నీ కలిసుంటాయి. క్షమకి ఈ కథ ఒక తార్కాణం. తనకు అపకారం చేసిన వాడికి ఉపకారం చేయాలనే సైనికుడి కథ ఇది. సైనికుడి జీవిత నేపథ్యంలో వచ్చిన కథలు చాలా తక్కువ. దేశ సరిహద్దులను, భాషా పరిధులను దాటిపోయిన కథ ఇది.*

**–మునిపల్లె రాజు**
ఎ-30/1 ఎ, ఫస్ట్ క్రిసెంట్ రోడ్,
సైనిక్‌పురి, సికింద్రాబాద్ – 94
సెల్ : 9346323922

అక్కడ నమ్మకం సన్నగిల్లినా తన మీదగాదు. ఓడి పోకూడదు. మరు సంవత్సరం గుంటూరు వైశ్యుల అన్నసత్రంలో, ఎవరినోటి మంచి మాటతోనో ప్రవేశం లభించింది. వైశ్యులు మెట్రిక్యులేషన్ వరకూ ఉదాత్త సహాయం చేశారు. ఆ పైన ''మా కొట్లో గుమస్తాగిరి చెయ్యి'' అని ప్రోత్సాహం. ఊహూఁ ఇంకా మెట్లు, మెట్లు.

సత్రంలో దిగిన వాళ్ళెవరో ఉత్తరాది యాత్రకు బయలుదేరుతూ, తననూ తోడుగా రమ్మని పిలుపు. కాశీనుంచి వెనుదిరిగి పోతూ ''రావా?'' అన్నప్పుడు తను ఇంకోసారి తల అడ్డంగా తిప్పాడు. ఆర్యావర్తంలో కాలినడక. పురాణాల్లోని గ్రామాలు, హరిద్వార్, రిషీకేశ్, లక్ష్మణ్‌ఝూలా. తిరిగి ప్రయాగ, కుంభమేలా. ఇదీ జీవితం చూడటమంటే. అశేష జనసమూహం. ఆమేయస్థిర సంకల్పం. అకుంఠిత విశ్వాసం, మోక్షం, పుణ్యం – ఆ గ్రామీణుల్తో మళ్ళీ పయనం.

'పరదేశి' – ''పరదేశి''

ఏదో ఒక సమయంలో నిత్యమూ అన్నం దొరికేది.

''బబువా. కహా జావో తుమీ''.

బదరీ క్షేత్రం తిరిగి వచ్చేదారిలో తన కంబళీ, పాత్ర – మార్కుల పుస్తకం తప్పితే అన్నీ పోయాయి. చేతిలో ఉన్నది చాలు. నారాయణ దత్ జోషి. ఎందుకు తనను అభిమానించాడో తెలియదు. వాళ్ళింట్లో పాలు పితకటం నేర్చుకొన్నాడు. హిందీ, సంస్కృతం పుస్తకాల భాండారం. ఇంకో మలుపు జోషిగారి ఉత్తరం. అన్నగారు వారణాశిలో పండా. చాలా ధనవంతుడు. ఏనుగు గూడా ఉన్నది. పల్లకీ, నలభై గదుల హవేలీ. యాత్రికులు.

ఆయన ప్రశ్నించింది ఒక్కటే 'మీ గోత్రం?' తను చెప్పాడు. మీ పెద్దలు మూడు తరాలు కాశీ వచ్చి మా ఇంట్లోనే దిగారు. అటకమీది పుస్తకాల్లో గోత్రనామాల కింద తాత ముత్తాతల పేర్లు. తనకు దేవనాగరి లిపి కొట్టిన పిండి. పండాగారి చీటీతోనే తను కాలేజీలో చేరింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడుగు పెట్టింది. మళ్ళీ లెక్కల్లో కుస్తీ. ఎప్పుడూ ఓడిపోలేదు.

పండాగారు తనకు సంబంధం చూశారు. తను చేతులు జోడించాడు. ఆయనకు కోపం. తను జోషీమఠ్ తిరుగు ప్రయాణం.

అక్కడ కంటోన్మెంటులో జోషీగారి స్నేహితుడి హితవచనం. సైన్యంలో కమీషన్డ్ ఆఫీసర్స్ సెలక్షన్‌కు మొదటి అప్లికేషన్ ఫారం. గణేశపూజ చేసిం తర్వాతే ఆ కాయితాన్ని ఆయన తాకనిచ్చింది. తరువాత, తను మాతృగయలో తల్లి శ్రాద్ధం పెట్టగల అర్హతకు ఉపనయనం జోషి గారింట్లోనే. మాతృగయ నుంచి వస్తూనే తనకు దేవలాలీలో ట్రైనింగ్ ఆర్డర్లు. శిక్షణ. శిక్షణ. శిక్షణ.

అన్నిచోట్లా తన లెక్కల పరిజ్ఞానం. కెప్టెన్సీ. జోషిగారికి మొదటి చెక్కు. సెలవలకు తనతో పయనించిన ఆర్మీ వెటర్నరీ సర్జన్ శ్రీ వాత్సవను బలవంతంగా జోషీమఠ్‌కు తీసుకువెళ్ళాడు. జోషీగారి ఆవుల్ని పరీక్షచేసి, డైరీ ఫారానికి గేదెలు కావాలని అతని సిఫారస్. అయిదు గేదెలకు సరిపోయే ఇంకో చెక్కునూ ఆ తరువాత పంపాడు. జోషీగారు తన పేర డ్రాఫ్ట్ తీసుకుని సగం డబ్బు తిరిగి పంపాడు. దాంతోనే వారణాసి నుంచి వచ్చిన జాతక చక్రాన్ని జత పరిచాడు. తనైతే దాన్ని విప్పిచూడలేదు. పుస్తకాల మధ్య – 'కామాయని' కావ్యంలో దాచేశాడు.

పండాగారిని క్షమించమని రాసిన తన పెద్ద ఉత్తరం. తను హిందీలో అంత పాండిత్యం సంపాదించినట్లు తెలియదు. జవాబు – ఒక సంస్కృత శ్లోకం. "ఉత్తమోత్తములైన మానవులకే కృతజ్ఞతా లక్షణం అబ్బేది. అవి అందుకొన్న వాడు, అందుకొన్నా గర్వపడని వాడు ఇంకా ఉత్తముడై ఉంటాడు" కింద ఒక ఆశీర్వాదం, "మృత్యువు నీ దరికి రాదు. ఒకనాడు నువ్వు సైన్యంలో పెద్ద పదవిలో ఉండగా చూస్తాను".

పండాగారికి తన జర్మన్ ట్రాన్సిస్టరూ, నాగాలాండ్‌లో ఉండగా కొన్ని అస్సాం మొంగా శాలువల జత ప్రత్యేక దూతతో పంపాడుగాని – తన ఇల్లు ఎప్పుడూ జ్ఞప్తికిరాలేదు. నారాయణదత్తుగారి దత్తపుత్రుడు గానే చలామణి అవుతున్నాడు. ఆ జోషీజీ ఇప్పుడు లేరు.

సాహిత్యంతో పరిచయం పెరిగినట్లే, ఎల్.టి.సి. ఇల్లు లేకపోయిన తనకు దేశంతో పరిచయం చేసింది. కజిరంగా నుంచి కన్యాకుమారి వరకూ, శిల్ప సంపదా, ప్రకృతి సంపదా – ఈ భూమిని పురాతన కాలాల నుంచీ ప్రభావితం చేసిన చరిత్రనంతా కళ్ళతో చూడటం సైన్యంలోనే సాధ్యమైంది. 105 ఎం.ఎం. గన్ గాని 130 ఎం.ఎం. బోఫోర్స్ గాని – "మేజర్ మూర్తి. ఆర్టిలరీ. అతి విశిష్ట సేవామెడల్ (ఎ.వి.ఎస్.ఎం)" బోర్డు చూడగానే జోహార్లు చేయవలసిందే. అయితే గాల్యాను అర్థం చేసుకొన్న తరువాత, తను ఓడిపోలేదన్న నినాదంతో పెరిగిన గర్వం పొర వీడి, శుభ్రజ్యోత్స్నలో, నీటిలో తన నీడలాగా కనిపిస్తున్నది.

అంత అందంగా లేని దస్తూరితో ఏడాది క్రితం తమ్ముడు రాసిన జాబు. తన చిరునామా ఎట్లా సంపాదించాడో! "అన్నయ్యా! నాన్న పోయాడు. పొలం వేలం వేశారు. అప్పులు తీరలేదని అమ్మ అంటున్నది. ఇబ్బందిగానే ఉంటున్నది. చెల్లి మళ్ళీ తప్పింది' అంతా రాసికింద పోస్ట్ స్క్రిప్ట్. "నిన్ను యూనిఫారం డ్రెస్‌లో చూడాలని ఉందన్నా".

ఆ జాబు తనలో ఏ వికారమూ కలిగించలేదు. ఎట్టి ప్రేరణాతరంగాలనూ లేపలేదు. ఒక పక్షం దినాల తరువాత ఇన్సూర్డ్ కవర్‌లో వెయ్యి రూపాయలు పంపాడు. ఉత్తరం ముక్కకూడా అందులో జత పరచలేదు. అన్నసత్రానికి చందా పంపినప్పుడు గాని, మేనమామ ఆర్నెల్ల పెంపకం బాకీకి డ్రాఫ్టు పంపినప్పుడు గాని వాళ్ళ ఉనికి కూడా అంటే పిన్ని, సవతి తమ్ముడూ, తన చూడని చెల్లీ – స్మృతిలో లేదు. ఈ రష్యన్ గాల్యా చాలా అసాధ్యురాలు. చాలా ఆలోచనల్ని రేగగొడుతోంది.

గోల్కొండలో ఉండగా కొన్న తెలుగు పుస్తకాలు – ముద్దుకృష్ణ 'వైతాళికులు' దువ్వూరి రామిరెడ్డి 'మధుశాల', కోడూరి సుబ్బారావు గారి 'సతీస్మృతి', వేదుల వారి పద్యాలు, రాయప్రోలు వారివీ కంఠతా కొన్ని, తడుముకొంటే కొన్ని. జాషువా సంగతి సరేసరి. హిందీ కావ్యాల్లో సుపరిచయమైన జయశంకర్ ప్రసాద్, మహాదేవివర్మ, ద్వివేది, చతుర్వేది – ఎవ్వరూ తన నీ రాత్రి నిద్రపోనిచ్చేట్లుగా లేరు. గతం ఉంది. వర్తమానం ఉంది. భవిష్యత్తూ ఉంది. గుర్తించనివాడు సగం మనిషి – అంటున్నారు వాళ్ళు.

***

మేజర్ దక్షిణామూర్తికి ప్రమోషన్ ఆర్డర్లు ఆలస్యం గానే వచ్చాయి. లెఫ్టినెంట్ కల్నల్. కొత్త ఫీల్డు యూనిట్‌కు ఓ.సి. (ఆఫీసర్ కమాండింగ్). వారం రోజుల్లో ఛార్జీ తీసుకోవాలి. కాని అతను హడావుడి పడలేదు.

***

"ఇప్పుడెందుకయ్యా నీకు సెలవు?" అని కల్నల్ జగన్నాథ్ విరగబడి నవ్వుతూ అడిగాడు. అవును, మరి సెలవంటే వద్దనే మనిషి గావున.

"సర్, మా తమ్ముణ్ణి మంచి స్కూల్లో చేర్చాలి. వాణ్ణి అక్కడే ఉంచితే చెడిపోతాడు" అన్నాడు మేజర్ మూర్తి.

*

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (27-12-1991)*

**కవిత**

## గాథ


1

నింగిలో
నేలపై
నీటిలో
తిరిగేవి
తల్లిగన్న
పిల్లలే!



2

నిప్పుకు
ఉప్పుకు
పెళ్ళి చేశారు,
ఇక రోజూ
ఇంట్లో
దీపావళే!



3

రాయి సతిని
కుంకుమ పతి
కౌగిలిస్తే
తక్షణం
పుట్టింది
గుడి



**–ఆచార్య కొలకలూరి ఇనాక్**